# కూన

ఓ.సుజాతాదేవి

చీకటి పడి చాలా సేపైంది. కాని మా అమ్మింకా రాలేదు. రోజూ వెలుగుండగానే వచ్చేది. ఇందాకటి వరకూ మా కూన ఇల్లెగిరి పోయేట్టు ఏడ్చి రాగాలు పెట్టింది. ఇప్పుడేమో కుంయ్యి... కుంయ్యి... అని మూలుగతుంది. కూన మా చెల్లి. దాని అసలు పేరు కూన కాదు, దురగ. అది పుట్టినప్పుడు నేనేమో...

"మా ఇంట్లో చిన్న కూన పుట్టింది. కూన పుట్టింది. అని గంతులేసి అరిచానంట. అంతే. అప్పటి నుంచి అది కూన. అందరూ "కూనా" అనే పిలుస్తారు. మా మామ్మ "కూనలూ" అని పిలుస్తాది.

"సీకటడి పోయినా ఇదింకా రాలేదు. ఎక్కడ ఊసులాడతా కూసుందో" అని మా మామ్మ విసుక్కుంటుంది. నేమా మా అమ్మ కోసం దారి బట్టుకు సూత్తా కూచున్నా.

"నంటె ముండకు నోరెండి పోతంది. ఏడుత్తాని క్కూడా ఓపిక లేదు." అని మలక మంచం మీద కూనను బోర్లా వేసి దబా దబా జోకొడుతోంది మామ్మ. మా కూన "కుంయ్యి... కుంయ్యి" అని మూలుగుతుంది. మా అమ్మ చేలోంచి అలిసింగా వచ్చినప్పుడు కూలీ ఎక్కువిస్తారు. లేక పోతే వడ్లయినా ఇస్తారు. ఆ వడ్లు నాకూ మా చిట్టన్నయ్యకూ ఇచ్చేస్తది అమ్మ. అవి కొట్లో ఇస్తే బిళ్లలూ... నిప్పండలూ.. పంచదార గోళీలూ... జీడీలూ బోలెడు కొనుక్కోవచ్చు.

అందుకే మా అమ్మ ఎప్పుడొస్తదా... అని చూస్తన్నా. కూన ఏడవట్లేదు. మామ్మ దాన్ని జోకొడుతూ పాట పాడుతోంది.

చందమామ రావే జాబిల్లి రావే
ఎండి గిన్నెలోన పాల బువ్వా తేవే
పైడిగిన్నె లోన పాల బువ్వా తేవే

ఆ పాట విని... కూన మళ్లీ ఏడుపందుకుంది. చీకటి పడింది. చందమామా వచ్చింది. కాని వేడి బువ్వా లేదు... పాల బువ్వా లేదు.

అప్పుడొచ్చింది మా అమ్మ. రాగానే చేతిలో సంచీ అక్కడ పడేసి కూనను ఎత్తుకుంది. కూన ఏడుపు మానేసింది.

"ఎక్కడికెళ్లావింత సేపు? పొద్దస్తమానం ఉంటది గాని నందలడిందంటే ఆపలేను" అంది మామ్మ



"జరుస్తావే ఉన్నాను. కాని పెద్దమ్మగారు మనిషిని పంపించారు. ఆరింటికెళ్లా" అంది అమ్మ.

"ఎంతుకంటా?" అని అడిగింది మామ్మ.

అమ్మ ఏంటో చెబుతుంది నేను వినలేదు.

అమ్మ తెచ్చిన సంచిలో మిఠాయుండలూ, మైసూరు పాకాలూ – కాయలు అబ్బ! రెండు చేత్తో పట్టుకుని బైటకు పరుగెత్తాను.

మామ్మెందుకో అమ్మను తిడతంది. అమ్మ తెచ్చిన సంచి బైటకు ఇసిరేసింది.

' 'ఒసే ఇంత పాతకానికి ఒడిగట్టావంటే" అంటోంది.

నేను గబగబా సంచీ లోనకు తీసుకెళ్లాను.

"అమ్మా నువ్వు తెచ్చిన మిఠాయుండలెంత బాగున్నాయో... రోజూ పెద్దమ్మ గారింటికి పనికెళ్లమ్మా అన్నాను." అప్పుడు మామ్మ "చిచ్చీ పాడు ముండా" అని నను ఒంగోబెట్టి దబదబా బాదింది. తింటూ... తింటూ.. ఉన్న మిఠాయి పడి పోయింది. చేతిలో సంచి జారిపోయి అన్నీ చెల్లా చెదురై పోయాయి. నే నేడుస్తూ పడుకున్నాను.

ఇదివరకెప్పుడో మామ్మను అడిగేస్నేను. "నువు రోజూ నంద మామను అ వేడి బువ్వా తీసుకురా... పాల బువ్వా తీసుకురా... నున్నండులూ

తీసుకురా... నక్కిలాలూ తీసుకురా అంటావు ఒక్కరోజూ తీసుకు రాడేం?" అంటే మామ్మంది కదా – "ఎందుకు తీసుకు రాడూ... మీ అమ్మతోనో వాన తోనో... నాతోనో కొనిపిస్తాడు!" అని చెప్పింది.

'మరి చందమామ... పెద్దమ్మ గారితో మితా యుండలు పంపితే మామ్మ పారేసిందెందుకో? ఏమో?' నాకు తెలియలా? అన్నం తినకుండా అలాగే నిద్రపోయాను.

తెల్లారి నేను లేచేసరికి మా అమ్మ పనికెళ్లి పోయింది. నేనూ సద్దన్నం తిని బళ్లోకెళ్లాను. పంతులు గార్లిద్దరూ ఇంకా రాలేదు.

ముక్కు రాజు, పొడుగు సీత కూర్చొని "బొమ్మొ స్తదా రాదా... వస్తదీ...

బొమ్మొస్తదా రాదా... రాదు... వస్తదీ... అనీ మా ఆశ." పాఠం పుస్తకం కాగితాల తిప్పతూ ఆడుకుంటున్నారు. అంతలో మూడో గంట ఘణ ఘణ కొట్టేశారు.

మా ఒకటో తరగతి పిల్లలందరూ బిలబిల మని చిన్నపంతులు గారి దగ్గర కూర్చున్నారు.

"ఇవాళ చాలా మంది మానేశారే అన్నారు పంతులు గారు.

"ఇళాళా... తాతబ్బాయి గారి సేలో కట్టే తడీ... అందరూ పరిగ కోసమెళ్లారు" అన్నాడు ముక్కురాజు.

"మనం కూడా ఎల్దామే... కడుపులో నెప్పని సెప్పి ఎలిపోదామే అని కర్రలచ్చిమి ఒకటే నా సెవిలో గొణుగుతుంది. "

"మాట్లాడుకుండా కూచ్చోండి." అన్నారు పంతులు గారు.

"మల్లీ!" అని నన్ను పిల్చారు పంతులుగారు.

"ఏంటండీ...?" అని లేచి మంచున్నాను.

'ఏదీ...పొన్న చెప్పిన వత్తుల పాఠం చెప్పు" అన్నారు. నేను మాట్లాడక పోయేసరికి "ఏంటీ రాలేదా?" అన్నారు.

"వచ్చిందండీ... వచ్చిందండీ" అని గడగడ చెప్పేశాను.

"అక్కకు చుటక్కుకు క ఒత్తు
సిగ్గుకు మొగ్గకు గ వత్తు
అమ్మకు బొమ్మకు మ ఒత్తు
అవ్వకు బువ్వకు బ ఒత్తు."

నేను పాఠం చెబుతుంటే మా మామ్మ గుమ్మంలో మంచుని నవుకుంటూ చూస్తుంది. పమిట చెంగుతో గలాను పట్టుకొని నా కోసం ఏంటో తెచ్చింది.

"పంతులు గారో... కుసిని కాపీ పట్టుకొచ్చాను మల్లి కోసం" అంది.

"చిన్న పిల్లకు కాఫీ ఏంటిమామ్మా" అని పంతులుగారు కోప్పడ్డారు. కాపీ తాగడానికి బైటకె ళ్లినపుడు మా మామ్మ దగ్గిర బాగా పేచీ పెట్టి పంతులుగారికి చెప్పించాను.

"నాకు తెలుసులే మామ్మా. పిల్లను బడి మానిపించి ఏ పరిగ కోసమో పంపిస్తావు. రెండు రోజుల్లో కోతలకు సెలవు లిస్తాం కదా" అన్నారు పంతులు గారు.

"ఇవాళొక్క రోజూ వదిలేయండయ్యా" ఇంటి కాడ కూడా సంటి ముండ ఏడుత్తాంది" అని బతిమిలాడింది మామ్మ.

"సరే కాని మిమ్మల్ని చూస్తే పిల్లలుండరు. రావ ద్దంటే మీరు వినరు. కానీ మామ్మా! పిల్లలు ఏరుకొచ్చే పరిగ గింజలు ఒక్క రోజులో అయి పోతాయి. అది నేర్చుకునే అక్షరాలు, బతికినంత కాలం ఉంటాయి." అన్నారు పంతులుగారు.

"అయ్యో! నాకు తెలుసునయ్యా!నా కొడుకులు ముగ్గురికీ సదువు సెప్పించా. ఆడపిల్లకూడా రెండు చదివిందండీ. ఇదిగో ఈలమ్మ అంటే నా కోడలు దానికే అచ్చరం ముక్కరాదు" అంది మామ్మ.

మామ్మ తిడితే తిట్టింది కాని, నన్ను పరిగేరు కోడానికి పంపింది. వరిసేలు కుప్ప వేసేటప్పుడు అక్కడ కూడా కంకులు రాలి పడతై కదా. ఆ కంకులు ఏరుకోడమే నన్నమాట పరిగంటే. నేనూ పొడుగుసీత, చిన్న చిట్టి, సింపిరి లచ్చిమీ కలిసి తాతబ్బాయి గారి సేలో కెళ్లాం.

తాతబ్బాయి గారి సేను పక్కనే పెద్దయ్యగారి సేనని మా అమ్మ అక్కడే ఉందని నా కస్సలు తెలవదు. కాని దూరం మంచే మా అమ్మ కోక చూసి ఆనమాలు కట్టాను. "అమ్మా! అమ్మా!" అని ఎగురు కుంటూ, అరుచుకుంటూ అమ్మ దగ్గ రకెళ్లాను. వరిమోళ్లు నా కాళ్ల నిండా గుచ్చుకుని నెత్తురొచ్చినా చూసుకోలేదు.

"ఒలే... ఒలేసెమల్లీ... ఎన్నాళ్లయిందే మీ యమ్మను చూసి" అని రంగమ్మామ్మ ఏతావోళం చేసినా ఆగలేదు. "ఎందుకొచ్చావు? బడి మానేసి ఎండంత తిరుగు తున్నావా?" అని అమ్మ కోప్ప డింది.

"ఇవాళొక్క రోజే బళ్లో అందరూ వచ్చేశారు. సెరుగ్గడలు తీసుకెళ్దామనీ..." అన్నాన్నేను.

"అయి నేను కొని పెడతాలే. ఇక్కడే కూసో" అంది మా అమ్మ. "మళ్లొస్తా" అని పరుగెత్తుకుని సింపిరి లచ్చిమి దగ్గరకెళ్లి పోయాను. "అన్నాని కొచ్చెయ్యి" అని ఎనకమాల మంచీ కేక బెట్టింది అమ్మ.

నా కెక్కువ కంకులు దొరగనివ్వడం లేదాళ్లు. కూలోళ్లందరూ అన్నాలకు లేచాక అమ్మ దగ్గర కెళ్లాను. అమ్మ నా కోసం అన్నం తినకుండా చూస్తుంది. కాలవలో నా కాళ్లూ చేతులూ కడిగింది. అమ్మా నేనూ అన్నం తిన్నాం. పెద్దయ్యగారు నాకు బోలెడు వరి కంకులు ఇచ్చారు. నేను చెట్టు కింద కూర్చుని పాటలు పాడుకుంటున్నా. కాసేపటికి మా అమ్మొచ్చి "రా మల్లీ పెద్దమ్మగారు మణిసిని పంపించారు" అంది.

నేనంతకు ముందెప్పుడూ పెద్దయ్యగారింటి కెళ్ల లేదు. ఎంత పెద్ద ఇల్లో. అక్కడ మా కూనంత బాబు గుక్కలు పెట్టి ఏడుస్తున్నాడు.

"రా...సీతాలూ.. పిల్లాడు ఏడుపు ఆపకపోతే నీ కోసం మనిషిని పంపించా" అన్నారు పెద్దమ్మ గారు "అయ్యయ్యో..." అని మా అమ్మ బాబుని ఎత్తుకోబోయింది.

"ఆగాగు కాస్త కాళ్లూ చేతులూ కడుక్కుని రా" అన్నారు పెద్దమ్మగారు.

చెంబెడు నీళ్లు పోసుకుని ఇదిగో ఈ చీర కట్టుకో" అని అమ్మ మీదికి ఓ చక్కటి కోక విసిరేసింది ఇంకో మామ్మ గారు.

"నీ పేరేంటే" అన్నారు పెద్దమ్మగారు.

"బండి శ్రీశైలం మల్లమ్మ. ఒకటో తరగతి" అని చెప్పాను.

"ఆ! మాటకారివేనే మల్లమ్మా" అని నవ్వారు పెద్దమ్మగారు. ఎంత బాగుందో! నేను అమ్మంకే చూస్తా కూచున్నా.

" పొలం పనులూ వద్దు, సదువూ వద్దు. నువ్వూ నీ కూతురూ మా ఇంట్లో ఉండి పిల్లాడిని చూసుకోండి సీతాలూ" అన్నారు అమ్మగోరు.

"మరి మా నాన!" అన్నాన్నేను.

"ఏంటో ఆలమ్మ చదువనీ, నీ పరీక్షలనీ పిల్లోడిని క్కూడా పంపించింది కాని లేకపోతే ..." అన్నారు మామ్మగారు.

ఆ పిల్లాడు అమ్మ పమిటలో దూరి ఆడుకుం టున్నాడు.

ఆ... నా కిప్పుడు తెలిసింది ఆడు మా కూన పాలన్నీ దొంగ పిల్లిలా తాగేస్తున్నాడు. కాళ్లూ చేతులూ ఊపుకుంటూ... గుటుకూ గుటుకుమని గుక్కల పట్టి మింగేస్తున్నాడు. నాకేడుపొచ్చింది.

అమ్మగారు మా కోసం ఒక సంచి తెచ్చి పెట్టింది. దాంట్లోంచి ఒక సిలుకు చొక్కా తీసి "ఇదిగ్గొనే మల్లీ ఇది నీకు" అని నా కిచ్చారు. నేనా చొక్కా విసిరేసిన్నాను. ఆ సంచీ తోసేసాను.

"అమ్మా!... రామ్మా... మనింటి కెల్దామమ్మా... కూన ఏడుస్తోందమ్మా" అన్నాను.

"ఉండూ, ఏంటా మంకుతనం అని" అమ్మ కోపంగా చూసింది. నే నేడ్చుకుంటూ ఇంటికొ చ్చాను.

మా కూన ఆకలేసి కుయ్యి... కుం..య్యి... మని మూలుగుతోంది.

"నా తల్లే నా తల్లే... నా కూనలమ్మే... నా బంగారమే" అని మామ్మ దబా దబా బోకొడు తోంది.

"ఊళోళోళో హాయీ... ఆయిగన్న తల్లీ నీళ కెళ్లిందీ! పాలిచ్చి పోరమ్మా పారపోతమ్మా...!"

"మామ్మా..." అని అరిచాను. ఏడ్చాను.

"ఏంటమ్మా... ఏంటే" అంది మామ్మ.

"మామ్మా కూనకు అమ్మ పాలే కావాలి. పార వతమ్మ పాలొద్దు" అన్నాన్నేను ఏడుస్తూ.

"రానీ ఈసారి అలింటికెళ్తే ఇరగ్గొడతా" అంది మామ్మ.